క్లుప్తంగా

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న నేతలు

గూడూరురూరల్ : గూడూరు మండలంలోని కొండాగుంట గ్రామంలో సోమవారం ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండియా విజన్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో నిమ్మ, పాడి రైతులకు ఉచితంగా కంటి వైద్యశిబిరం నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు వాకాటి మస్తాన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ రమణమ్మ వైద్య శిబిరాన్ని సందర్శించి ఫౌండేషన్ అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, ఇండియా విజన్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమం మాటే..

- ప్రజల గుండెల్లో సీఎం జగనన్న
- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

తడ: ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబం కూడా సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్య అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం బీవీపాళెం గ్రామంలో నిర్వహించారు. స్థానిక నాయకులు కోడి ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్తులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. బీవీపాళెం గ్రామం, ముస్లిం కాలనీ, పాతకుప్పం ప్రాంతాల్లో కిలివేటి నాయకులతో కలసి పర్యటించి ప్రభుత్వం ద్వారా ప్రతి కుటుంబానికి అందిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. గ్రామంలోని కొన్నిచోట్ల అంతర్గత రోడ్లు, మురుగు కాలువల గురించి స్థానికులు ఎమ్మెల్యేని కోరారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎన్నికల సమయంలో ఇచ్చిన నవరత్నాల వాగ్దానాలను అమలు చేసే సమయంలో కరోనా మహమ్మారి వ్యాప్తి చెందడంతో రెండేళ్ల పాటు ఇబ్బందులు తలెత్తాయని వివరించారు. సంక్షేమ పథకాలను ఓ వైపు నిర్విరామంగా అమలు చేస్తూ అభివృద్ధి పనులను కూడా చేస్తున్నామని తెలిపారు. రెండేళ్లపాటు కరోనా కారణంగా పనుల్లో కొంత జాప్యం జరిగాయని వాటిని త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బిరియానీ తయారీలో పేరు గాంచిన మాస్టర్లు ఉన్న బీవీపాళెంలోని ముస్లిం కాలనీలో ఓ ఇంటి వద్ద తయారు చేస్తున్న బిరియానీని ఆయన వండారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామయ్య, ఎంపీడీఓ మురళీకృష్ణ, ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ రఘురెడ్డి, జెడ్పీటీసీ ఇందుమతి, నాయకులు మునీష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవిరెడ్డి, రత్నం, కుమార్, సుధాకర్, సుందర్‌రెడ్డి, మునస్వామిరెడ్డి, కోదండం, రమేష్, మణి, రాజేంద్రన్, ఆసిమ్, తమిన్, ఆళయ్య, తిరుమలైరెడ్డి, చంద్రారెడ్డి, అనిష్, యువరాజ్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ బావుటా బుక్‌లెట్లను అందిస్తున్న కిలివేటి సంజీవయ్య

సుధీర్‌బాబుకు ఘన సన్మానం



సుధీర్‌బాబును సన్మానిస్తున్న అధికారులు

కలువాయి: మండలంలో ఆరేళ్లగా విద్యాధికారిగా పనిచేసి సమగ్రశిక్ష ఏఎంఓగా పదోన్నతిపై వెళ్లిన జి.సుధీర్‌బాబును ఉపాధ్యాయ సంఘాల వారు సోమవారం ఘనంగా సన్మానించారు. మండల విద్యావనరుల కేంద్రంలో జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ లక్ష్మీదేవి, ఎంపీడీఓ నారాయణ, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు సుధీర్‌బాబు సేవలను కొనియాడారు. అనంతరం జిల్లాస్థాయిలో ఉత్తమ విద్యాధికారిగా ఎంపికైన కలువాయి ఎంఈఓ బాలకృష్ణారెడ్డిని, ఉత్తమ ఉపాధ్యాయురాలు విజితను కూడా ఘనంగా సత్కరించారు.

15 రోజుల్లో అభ్యంతరాలు తెలపండి

గూడూరు: పట్టణ, గ్రామీణ ప్రణాళికా విభాగం ఆమోదం తెలిపిన లేఅవుట్లపై ఎవరికైనా ఎలాంటి అభ్యంతరాలు ఉంటే, 15 రోజుల్లోగా రాతపూర్వకంగా తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని అనధికార అక్రమ లేఅవుట్‌లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ మేరకు పట్టణ, చిల్లకూరు పరిధిలోని కొన్న లేఅవుట్లకు పట్టణ, రూరల్ ప్రణాళికా విభాగం ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆమోదం తెలిపారని చెప్పారు. చిల్లకూరు సర్వే నంబరు 146-1, 2, 3, 4.11, 14, 15, 25, 26, 27లలోని 2.44 ఎకరాల విస్తీర్ణంలోనూ, అదేవిధంగా పోటుపాళెం గ్రామ సర్వే నంబరులోని 823-2పీ, 824, 1938-పీ, 1558, 1589, 1590-ఏ,బీ, సీ, 797-1ఎ, 822, 1947-7, 8, 1949-1లలోని 21.65 సెంట్లు లేఅవుట్‌లకు అనుమతులు మంజూరు చేసేందుకు ఆమోదం తెలిపారన్నారు. ఈ మేరకు వీటిపై ఎవరికైనా ఎలాంటి అభ్యంతరాలు ఉంటే, ఈ రోజు నుంచి 15 పని దినాల్లోపు రాత పూర్వకంగా మున్సిపల్ కార్యాలయంలో తెలియజేయాలని ఆయన కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

ఓజిలి: తిరుపతి జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్లను కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్ఈ విజయకుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కార్యక్రమంలో పురోగతి సాధించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని వారిని ఆదేశించారు. డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కుమార్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి షేషమాద్రి, జిల్లా అధ్యక్షుడు రాంమోహన్, ప్రధానకార్యదర్శి సుమన్‌రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు, డీఈఈ, ఏఈఈలు తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్నవారికి జగనన్న ఇల్లు

వాకాడు: పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న లేఅవుట్ల ద్వారా అన్ని వసతులతో కూడిన అందమైన గృహాలను నిర్మిస్తున్నారని వాకాడు సొసైటీ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచులు, హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ గోపీనాథ్, జెడ్పీటీసీ రౌతు రామకృష్ణ, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

ఓజిలి: నుడా పరిధిలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. మండల పరిధిలోని పెదపరియ గ్రామంలో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించి గ్రామస్తులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 49 ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరైనట్లు తెలిపారు. హౌసింగ్ ఏఈ శివప్రసాద్, ఏపీఎం నిర్మలమ్మ, ఏపీఓ ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గొల్లబోయస్వామికి పూజలు

రాపూరు: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన దేవస్థాన అనుబంధ ఆలయమైన గొల్లబోయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఏసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. గోనుపల్లిలో సమీపంలోని గొల్లబోయస్వామి జన్మ నక్షత్రం మాఘశుద్ధ దశమి అయినందున మంగళవారం మాఘశుద్ధ దశమి కావడంతో స్వామివారి మూలమూర్తికి అభిషేకం, పూలంగిసేవ, గోపూజ, హోమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

పేకాట స్థావరంపై దాడులు

వెంకటగిరి: పేకాటస్థావరంపై సెబ్ సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం దాడులు నిర్వహించి ఐదుగురిని, ఒక మోటారుసైకిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. అమ్మవారిపేట చెరువు ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అడంతో దాడులు చేసి ఐదుగురు వ్యక్తులను, ఓ మోటారు సైకిల్, రూ.2,570 నగదు, మూడు సెల్ ఫోన్‌లను స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సహజ వనరుల రక్షణకు చర్యలు



నేలపట్టు పక్షుల కేంద్రం అధికారులతో మాట్లాడుతున్న చలపతిరావు

దొరవారిసత్రం : సహజ వనరులు, అడవులను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర ఫారెస్టుశాఖ ప్రత్యేక కార్యదర్శి పీవీ చలపతిరావు తెలిపారు. ఆయన సోమవారం నేలపట్టు పక్షుల సంరక్షిత కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఆయన విహంగాలను వీక్షించడమే కాకుండా కేంద్రంలోని ఏర్పాట్లు, వసతులపై ఆరాతీశారు. తర్వాత రూ.5 లక్షలతో కొనుగోలుచేసిన మూడు లక్షల చేపపిల్లలను ఆయన కేంద్రంలోని మూడు చెరువుల్లో వదిలిపెట్టారు. పక్షుల కేంద్రాలను సంరక్షించే క్రమంలో ఐక్యరాజ్య సమితి కేటాయించిన నిధులు రూ.30 లక్షలు నేలపట్టు, పులికాట్ ప్రాంతాలకు కేటాయించినట్టు తెలిపారు. ఇందులో నేలపట్టుకు కేటాయించిన రూ.10 లక్షల్లో రూ.5 లక్షలతో వివిధ రకాల చేప పిల్లలను కొనుగోలు చేసి పక్షుల మేత కోసం కేంద్రంలోని చెరువుల్లో వదిలి పెట్టినట్లు చెప్పారు. మిగిలిన రూ.5 లక్షలను చెరువుల అభివృద్ధికి వేసవిలో వెచ్చిస్తామన్నారు. ఆయన వెంట తిరుపతి స్క్వాడ్ డీఎఫ్ఓ శివకుమార్, సూళ్లూరుపేట డీఎఫ్ఓ శామ్యూల్, రేంజర్ ఆఫీసర్ వరప్రసాద్, సూళ్లూరుపేట రేంజ్ అధికారి నరసింహారావు ఉన్నారు.

తీర ప్రాంత ప్రజల మెరుగైన జీవనానికి కృషి

తడ: పులికాట్ తీర ప్రాంతంలోని మత్స్యకారులు, రైతులు ఇతర పేదవర్గాల అభ్యున్నతి కోసం గ్లోబల్ క్లైమెట్ ఫండ్(జీసీఎఫ్)ని వెచ్చించి అభివృద్ధి బాటలో నిలిపేందుకు యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(యూఎన్‌డీపీ) ద్వారా పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఐఎఫ్ఎస్ అధికారి, రాష్ట్ర అటవీ శాఖ చీఫ్ సెక్రటరీ చలపతిరావు తెలిపారు. సోమవారం బీవీపాళెం పడవల రేవుకు చేరుకున్న సీఎస్ ఇతర అటవీశాఖ అధికారులతో కలిసి పడవ ద్వారా పులికాట్‌లో ప్రయాణించారు. ఈ సందర్భంగా బీవీపాళెం రేవులో చలపతిరావు విలేకరులతో మాట్లాడారు. పులికాట్‌లో వివిధ కారణాలతో మత్స్యసంపద తగ్గిపోవడంతో పులికాట్‌నే నమ్ముకుని జీవిస్తున్న మత్స్యకారుల జీవితాలు అయోమయంలో పడుతున్నాయని అన్నారు. అదేవిధంగా తీర ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకుని జీవించే చిన్న, సన్నకారు రైతుల పరిస్థితి కూడా నీటి లభ్యత తగ్గడంతో తీవ్ర ఇబ్బంది ఎదురవుతున్నాయని అన్నారు. అందులో భాగంగా మంగళవారం యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ టీంకి చెందిన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన అధ్యయన బృందం అటకానితిప్ప, బీవీపాళెం, ఇరకం ప్రాంతాల్లో పర్యటిస్తుందని ఆయన తెలిపారు.

నవభారత నిర్మాణమే లక్ష్యం



దక్కిలి: పోషకాహార స్టాళ్లను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

దక్కిలి: నాటి స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న నవభారత నిర్మాణమే వారికి అందించే నిజమైన నివాళి అని కేంద్ర ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి నాగసాయిసూరి తెలిపారు. మహాత్మగాంధీ వర్ధంతి, అమర వీరుల సంస్కరణ దినోత్సవం, స్వర్ణోదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం దక్కిలిలో బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో భారత ప్రభుత్వ సమాచార మంత్రిత్వశాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నెల్లూరు ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి, ఎంపీపీ గోను రాజశేఖర్ అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశవ్యాప్తంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. జెడ్పీటీసీ కలిమిలి రాజేశ్వరి, ఎంపీపీ గోను రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఆడపిల్లలు చదువుకునేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పథకం కింద అన్ని మౌలిక వసతులను కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ముందుగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కరీముల్లా, ఎంఈఓ వెంకటేశ్వర్లు, వైద్యాధికారి బిందు, సీడీపీఓ శంషాద్‌బేగం, ప్రముఖ సామాజిక కార్యకర్త మాల కొండారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ భూముల వేలంతో ఆదాయం

చిల్లకూరు: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన మెట్ట భూములను సోమవారం ఆలయ ఆవరణలో దేవదాయశాఖ అధికారులు కౌలుకు వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ధరావతు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. సర్వే నంబర్ 92-1లో ఉన్న 25 ఎకరాలకు సంబంధించి వేలం వేయగా ఏడాదికి కౌలు రూ.3.40 లక్షలకు పాడుకున్నారు. అలాగే 92-3లోని 5 ఎకరాలకు వేలం వేయగా ఏడాదికి రూ.1.97 లక్షలకు పాడారు. ఈ సందర్భంగా దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీలత మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అన్ని మెట్టభూములు మాత్రమే ఉన్నాయని, వీటిని వేలం ద్వారా కౌలుకు ఇచ్చి ఆలయ అభివృద్ధికి నిధులు వినియోగించేలా చూస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నవీన్‌కుమార్, చైర్మన్ ఆనంద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ ఆదేశాలే శిరోధార్యం



వెంకటగిరి: సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు



మాట్లాడుతున్న రవికుమార్

వెంకటగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలే పార్టీ శ్రేణులకు శిరోధార్యమని సీనియర్ నాయకులు చెలికం శంకరరెడ్డి, పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు, జిల్లా సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ తెలిపారు. స్థానిక నేదురుమల్లి నివాసంలో సోమవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో పార్టీ తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించిందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల ప్రకారం సమన్వయకర్త నేదురుమల్లి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త, నాయకుడు, పార్టీ పదవుల్లో ఉన్నవారు పనిచేయాలన్నారు. పార్టీ విధానాలకు విరుద్ధంగా నడుచుకోవడం తగదని, అలాంటి వారిని పార్టీ అధిష్టానం ఉపేక్షించదన్నారు. కార్యక్రమంలో సీనియర్ నేతలు సురేష్‌రెడ్డి, బ్రహ్మయ్య, దశరథరామిరెడ్డి, రమేష్‌రెడ్డి, కౌన్సిలర్లు వహీదా, కృష్ణమూర్తి, మల్లిఖార్జున, రామారావు, శ్రీనివాసులురెడ్డి, కృష్ణయ్య, నరసింహారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాపూరు వైఎస్సార్‌సీపీ నాయకులు

నేదురుమల్లి అడుగుజాడల్లో నడుద్దాం

సైదాపురం: వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అడుగుజాడల్లో నడుద్దామని సైదాపురం మండల జేసీఎస్ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రం సైదాపురంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్గ విబేధాలకు తావివ్వకుండా అందరూ కలిసికట్టుగా వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కొందరు పార్టీ పదవులను అనుభవిస్తూ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై అధిష్టానం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందన్నారు. గతంలో పార్టీ నాయకుల తీరుతో ఇబ్బంది పడిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే గడపగడపకు కార్యక్రమం కూడా ప్రారంభం అవుతుందన్నారు. నాయకులు రాంగోపాల్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ శారద, ఉపసర్పంచ్ శివకుమార్ నాయకులు సాంబయ్య, పెంచలయ్య, రమేష్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఆదేశాలు పాటించాలి..

రాపూరు: వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించారని ఆయనకు పార్టీలో ఉన్నవారంతా ఆయన కింద పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్ రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు సంఘ కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, కలపాటి మధురెడ్డి, డాక్టర్ ఖాదర్‌బాషా, ఏఎంసీ ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, రాఘవయ్య, గౌస్‌పీర్, బాబు, రమణారెడ్డి, విజయ్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.